క్లుప్తంగా

శ్రీశైలానికి మహాపాదయాత్ర



వినుకొండ(నూజెండ్ల): అతి పురాతనమైన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన భక్త బృందం, ఆలయ నిత్య అన్నదాన ప్రధాన సేవకులు జాజుల మాల్యాద్రి ఆధ్వర్యంలో శ్రీశైలానికి మహా పాదయాత్ర కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బద్దిక నరసింహారావు, వెంకటేశ్వర్లు, అనుముల రామకృష్ణ, సరోజనమ్మ, కృష్ణవేణి, 21 మంది భక్తబృందం ఈ మహాపాదయాత్రలో పాల్గొన్నారు.

అక్టోబరు 3 నుంచి దసరా వేడుకలు



శావల్యాపురం: స్థానిక కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో దసరా ఉత్సవాలు అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రెడ్డి జ్వాలా నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రుల పురస్కరించుకొని రోజుకో అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తుందన్నారు. అలాగే ప్రతిరోజు ఉభయ దాతలచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఉభయ దాతలు వితరణ చేసిన తీర్థప్రసాదాలు భక్తులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్ఎంపీలకు అవగాహన



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆర్ఎంపీ అండ్ పీఎంపీ అసోసియేషన్ సారథ్యంలో పట్టణ, గ్రామీణ వైద్యులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, డైరెక్టర్ డాక్టర్ గర్లపాటి జ్ఞానేశ్వరి, కన్సల్టింగ్ డాక్టర్లు పి.మహేశ్వరరావు, కొరివిపూడి అభిషేక్, ఉప్పాల పూర్ణిమి, అన్న మణికంఠ సురేష్, శాంతిశ్రీ పాల్గొని తమ అమూల్యమైన సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం డాక్టర్ల బృందాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూ నియన్ సభ్యులు నాగమల్లేశ్వరరావు, బ్రహ్మం, వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, సాంబశివరావు, 400మంది ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు అండగా ఉంటాం

సత్తెనపల్లి: టీడీపీ అల్లరి మూకల దాడిలో గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని కొమెరపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. చికిత్స పొందుతున్న మందులపాలెం నూరుల్లా, ఆయన కుమారులు మహబూబ్ సుభాని, బుడా ఆరోగ్య పరిస్థితి, దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులను పరామర్శించి వారి కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. చిట్టా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సానుభూతి పరులపై రోజు రోజుకీ దాడులు పెరిగిపోతున్నాయని, భయ భ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. వృద్ధుడని అని కూడా చూడకుండా నూరుల్లా, అతని కుమారులపై కర్రలతో దాడి చేయడం దారుణమన్నారు. ఇకనైనా దాడులు మానుకోవాలని, బాధ్యులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాలకు 60 మంది ఎంపిక

సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. అందులో 60 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. మెగా జాబ్ మేళాకు 200 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వారిలో స్కిల్స్ ప్రకారం ఆయా కంపెనీల ప్రతినిధులు వివిధ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, జేపీ, వెంకట కోటయ్య పాల్గొన్నారు.

ఫైనాన్స్ ఆఫీసులో చోరీకి యత్నం

సత్తెనపల్లి: పట్టణంలోని ఆటో నగర్ వెంగళ రెడ్డి నగర్‌లో ఉన్న శ్రీ రామ్ ఫైనాన్స్ ఆఫీసులో గుర్తుతెలియని వ్యక్తుం చోరీకి యత్నించాడు. సత్తెనపల్లి బ్రాంచ్ మేనేజర్ యడ్లపల్లి వీరాంజనేయులు రోజూలానే గత శుక్రవారం సాయంత్రం రాత్రి 6.30 గంటలకు విధులు ముగించుకొని కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూడగా.. కిటికీ రెండు ఇనుప గ్రిల్స్ కట్ చేసి కనిపించింది. కంప్యూటర్‌ను పరిశీలించి, రాడ్డుతో సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తి పగలగొట్టినట్లు గమనించాడు. అయితే ఎలాంటి నగదు కానీ, విలువైన పత్రాలు కానీ చోరీ కాలేదని గుర్తించాడు. మేనేజర్ వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్యవైశ్యుల వ్యాపారాభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



ప్రమాణస్వీకారం చేసిన నూతన కార్యవర్గ సభ్యులతో మున్సిపల్ మాజీ చైర్మన్ గుప్త

నరసరావుపేట: నియోజకవర్గంలో వ్యాపారులైన ఆర్యవైశ్యుల సహకారంతోనే తాను విజయం సాధించానని, వారి వ్యాపారాభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. స్థానిక పట్టాభి రామస్వామి దేవాలయంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన నూతన చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ పాలకవర్గ ప్రమాణస్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చాంబర్ ఏ పార్టీ వైపు ఉంటుందో ఆ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా వనమా సాంబశివరావు, పచ్చిపులుసు సతీష్‌కుమార్, కోశాధికారిగా దేసు శ్రీనివాసరావుతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, రమేష్ చంద్రదత్, బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ, భారీ సంఖ్యలో వ్యాపారులు, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వినుకొండ(నూజెండ్ల): యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శంకర కంటి వైద్యశాల సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షల వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీనియర్ నాయకులు విశ్రాంత ఉపాధ్యాయులు ఎ.నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 మంది ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, వారి కుటుంబసభ్యులు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో పది మందికి కళ్లజోళ్ల అవసరమని, ఇతర సమస్యలు ఉన్న 20 మందికి ఈహెచ్ఎస్ ద్వారా ఆపరేషన్లు చేయిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం.రవిబాబు, ఆర్.అజయ్‌కుమార్, జి.నాగేంద్రుడు, ఎం.పోలయ్య, పీపీ జిలానీ, సూర్యప్రకాశరావు, భాస్కరరావు, నాగేశ్వరరావు, డి.వి.లింగయ్య, మల్లికార్జునరావు, ప్రసాద్, రామిరెడ్డి, జి.రామారావు, ప్రభాకరరావు, ఈ. వెంకటరెడ్డి, ప్రకాష్, తిరుపతిరెడ్డి, నారాయణలు, హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ వందన, కాశి ప్రసాద్, పది మంది టెక్నీషియన్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇండస్ట్రీయల్ టూర్

వినుకొండ(నూజెండ్ల): ఇండస్ట్రీయల్ టూర్‌లో భాగంగా నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వినుకొండలోని పలు చిన్న తరహా చేతివృత్తుల పరిశ్రమలను పరిశీలించారు. మగ్గం వర్క్, రెడిమేడ్ దుస్తుల తయారీ ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాణి, సుకన్య, శేషాంజనేయులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు 95 శాతం పూర్తి

శావల్యాపురం: ఈ పంట నమోదు 95 శాతం పూర్తి చేసినట్లు ఏడీఏ బోయపాటి రవిబాబు ఆదివారం తెలిపారు. నియోజకవర్గంలో 40 వేల హెక్టార్లు సాగు భూమి ఉండగా అందులో 10 వేల హెక్టార్లు వరి పంటను రైతులు సాగు చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని రైతులకు అవసరమైన ఎరువులు కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు.

నేడు సాతులూరులో స్కూల్‌గేమ్స్ పోటీలు

నాదెండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ నియోజకవర్గ స్థాయి పోటీలు సోమవారం నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ కోఆర్డినేటర్లు ఇస్మాయిల్, నాగరాజు తెలిపారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహించనున్న పోటీలకు మండల స్థాయి పోటీల్లో గెలుపొందినవారు ఉదయం 10 గంటలకు పాఠశాలలో రిపోర్టు చేయాలని కోరారు.

నేడు జాబ్ మేళా

సత్తెనపల్లి: స్థానిక అచ్చంపేట రోడ్డులోని రైల్వే గేట్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ ఎస్‌డీసీ), ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్ అధ్వర్యంలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఐలఅగ్రి సర్వీసెస్, బిజాజ్ ఫిన్సర్వ్, రిలయన్స్ రిటైల్, శ్రీ విజయబయో ఫర్టిలైజర్ వంటి పలు రకాల కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఎంపికైన వారికి జీతం వారి విద్యార్హతను బట్టి ఉంటుందన్నారు. జాబ్ మేళాకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసి, పీజీ చదివి, 18–30 సంవత్సరాల వయసు గల నిరుద్యోగులు బయోడేటా, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాల నకలు, ఆధార్, పాస్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు ఇ. రామకృష్ణరెడ్డి 80743 93466, బి.అంజి రెడ్డి 94949 86164 నంబర్లకు సంప్రదించాలన్నారు. httpr://rkiuniverre.aprrdc.in/ వెబ్ సైట్‌లో కూడా రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు.

గర్నెపూడిలో ఘర్షణ

సత్తెనపల్లి: పాత కక్షల నేపథ్యంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిన ఘటన మండలంలోని గర్నెపూడి గ్రామంలో ఆదివారం జరిగింది. ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకోవడంతో పేరుపోగు శివ అనే వ్యక్తి తలకు బలమైన గాయాలు కాగా.. పొంగులూరి నాగరాజు అనే మరొక వర్గం వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇరువురు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదులు చేయగా పోలీసులు విచారిస్తున్నారు.

విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు అలవర్చుకోవాలి

చిలకలూరిపేట: శాస్త్రీయ దృక్పథం, ఆలోచన విధానం విద్యార్థి దశలోనే అలవర్చుకోవాలని జవహర్ నవోదయ విద్యాలయం రిటైర్డ్ ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రభాకరరెడ్డి సూచించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు నిర్వహించనున్న చెకుముకి సంబరాలు పోస్టర్‌ను పట్టణంలోని సాదినేని చౌదరయ్య స్కూల్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి, శాస్త్రీయ ఆలోచన విధానం పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక ప్రతిఏటా చెకుముకి సంబరాలు నిర్వహిస్తుందని తెలిపారు. తొలుత పాఠశాలల స్థాయిలో ఆ తదుపరి మండల స్థాయిలో నిర్వహించనున్న చెకుముకి సంబరాల్లో అత్యధికంగా విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పీవీ సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, ఉపాధ్యక్షుడు కె.రామమోహన్‌రావు, చుక్కా విన్సెంట్‌పాల్, గోరంట్ల నారాయణ పాల్గొన్నారు.

అర్చక సంఘం అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న రాజాభార్గవ నాథ్

ఫిరంగిపురం: అర్చక సంఘ అభివృద్ధికి కృషి చేయాలని పల్నాడు జిల్లా సత్తెనపల్లి డివిజన్ అర్చక సంఘ నాయకుడు వి.రాజాభార్గవనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి కల్యాణ మండపంలో మండల బ్రాహ్మణ అర్చక సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. సంఘ సభ్యులు ఐకమత్యంగా ఉండి పలు అంశాలపై చర్చించి, మంచి నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. అంతేకాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న అర్చకులను సంఘం తరుపున ఆదుకోవాలని సూచించారు. వృత్తిపరంగా ఎటువంటి సమస్యలు వచ్చిన సంఘం దృష్టికి తీసుకువస్తే వాటిని సమన్వయంతో పరిష్కరించుకోవాలని చెప్పారు. అనంతరం ధూపదీప నైవేద్యం పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నారాయణం ప్రసాదాచార్యులు, అధ్యక్షుడు దీవి. వరప్రసన్నమూర్తి, కార్యదర్శి రావూరి పూర్ణానంద శాస్త్రి, పలు గ్రామాల అర్చకులు పాల్గొన్నారు.

చర్చనీయాంశంగా పీఆర్కే పీఏ శర్మ కిడ్నాప్ వ్యవహారం

కారెంపూడి: వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పీఏ, న్యాయవాది ఎం.శ్రీనివాసశర్మ కిడ్నాప్ వ్యవహారం కారెంపూడి మండలంలో చర్చనీయాంశంగా మారింది. 30 ఏళ్లుగా పలువురు ఎమ్మెల్యేలకు శ్రీనివాస శర్మ పీఏగా పనిచేయడంతో నియోజకవర్గంలోని ప్రజలకు శర్మ సుపరిచితుడు. శర్మను ఇంట్లో నుంచి కిడ్నాప్ చేసి తీసుకు వచ్చి మండలంలోని నరమాలపాడు, ఒప్పిచర్ల గ్రామాల మధ్య విడిచిపెట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కిడ్నాపర్లు కారెంపూడి మండలానికి చెందిన వారై ఉండవచ్చనే ప్రచారం జరుగుతోంది. శర్మ వివాద రహితుడిగా పేరున్న వ్యక్తి. పైగా న్యాయవాది. ఆయన్ని కిడ్నాప్ చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఎవరు చేశారు? ఎవరు చేయించారనే విషయాలపై ప్రజల్లో చర్చ నడుస్తోంది. ఈ దిశగా పోలీసులూ ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై శ్రీనివాస శర్మ కేసు పెట్టలేదని తెలుస్తోంది.

డ్రెయినేజీల్లో పూడిక తీత



కారెంపూడి: స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాలలో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లోని డ్రెయినేజీల్లో పూడిక తీత పనులు జరిగాయి. ముందుగా అధికారులు పరిసరాల పరిశుభ్రతపై ప్రచార ర్యాలీలు నిర్వహించారు. అనంతరం కార్మికులతో రోడ్డు పక్క కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టారు. వేపకంపల్లి, గాదెవారిపల్లె తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు జరిగాయి. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, ఎస్ఎంసీ సుబ్బారావు ర్యాలీలలో పాల్గొని ప్రజలను గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్..



అండర్ -17 వాలీబాల్ బాలికల జట్టు



అండర్-17 కబడ్డీ బాలురు జట్టు



అండర్ 14 మండల బ్యాడ్మింటన్ బాలికల జట్టు

సత్తెనపల్లి: గ్రామీణ విద్యార్థులు చదువులో రాణిస్తూనే.. క్రీడల్లో సత్తా చాటుతున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నందిగామలో శనివారం జరిగిన మండల స్థాయి క్రీడా ఎంపికల్లో ప్రతిభ కనబరిచారు. మండల స్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లో అండర్-14, 17 విభాగాల్లో ఉత్సాహంగా తలపడ్డారు. మండల జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు అథ్లెటిక్స్..

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు సోమవారం సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ క్రీడా ప్రాంగణంలో జరగనున్నాయి. చెస్, యోగా ఎంపిక పోటీలను నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ మండల కో-ఆర్డినేటర్ లాకు పిచ్చయ్య తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలి

సీపీఎం మహాసభలో తీర్మానం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి విజయకుమార్

నరసరావుపేట: రాష్ట్రంలో టీడీపీ కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాలను వెంటనే అమలులోకి తీసుకురావాలని సీపీఎం మహాసభ తీర్మానం చేసినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం కోటప్పకొండరోడ్డులోని కార్యాలయంలో పట్టణ శాఖ మహాసభ సయ్యద్ రబ్బాని అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు ఏవీకే దుర్గారావు ఆవిష్కరించారు. గత మహాసభ నుంచి ఇప్పటివరకు చనిపోయిన నాయకులు, కార్యకర్తలకు సంతాపం తీర్మానం పెట్టారు. జిల్లా కేంద్రం నుంచి గుంటూరు విజయ కుమార్, డి.శివకుమారి రాజకీయ రిపోర్ట్ ఇచ్చారు. అనంతరం కార్యదర్శి నివేదికపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రస్తుతం ఒక శాఖగా ఉన్న దానిని తూర్పు, పడమర రెండు శాఖలుగా విభజించారు. తూర్పు శాఖకు సయ్యద్ రబ్బాని, పడమర శాఖకు సిలార్ మసూద్ కార్యదర్శి సభ్యులు ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కొన్ని తీర్మానాలను చేశారు. వాటిలో కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ స్కీమ్ వర్కర్లపై జరుగుతున్న రాజకీయ వేధింపులను నిలుపుదల చేయాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, పీజీ కాలేజీలు ఏర్పాటు చేసి జూనియర్ కాలేజీ, డిగ్రీ, పీజీ కాలేజీలకు పక్కా భవనాలను ఏర్పాటు చేయాలని, పట్టణంలో రవాణా రంగా కార్మికులకు ఆటోనగర్ ను ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ దారులకు ఉచిత ఇసుక సమర్థంగా వినియోగించేటట్లు చూసి భవన నిర్మాణ కార్మికుల ఉపాధి పెంచాలని మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. దీనిలో పార్టీ సీనియర్ నాయకులు ఇ.మస్తాన్‌రెడ్డి, డి.సుభాష్‌చంద్రబోస్, జె.శ్రీనివాసరావు, కట్ట కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేస్తే గౌరవం



శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్‌ను సన్మానిస్తున్న పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు

చిలకలూరిపేట: విధి నిర్వహణలో చిత్తశుద్ధి ప్రదర్శించిన వారిని గౌరవించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ చెప్పారు. మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ వినుకొండకు బదిలీ అయిన షేక్ ఇస్మాయిల్‌ను ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో పట్టణ ప్రజల మన్ననలు పొందటంతో పాటు పారిశుద్ధ్య కార్మికుల అభిమానాన్ని ఇస్మాయిల్ చూరగొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమరగిరి చెంచయ్య, అక్కులయ్య, బాలకోటి, ఆదినారాయణ, గంగాధర్, అంజయ్య పాల్గొన్నారు.

ఉండి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

రొంపిచర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపిన ఎమ్మెల్యే రఘు రామకృష్ణంరాజుపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని దళిత బహుజన హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు డాక్టర్ గోదా రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని నల్లగార్లపాడులోని అంబేడ్కర్ నగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ప్రపంచ దేశాలు కొనియాడినట్లు చెప్పారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలు ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుకు తెలియకపోవటం సిగ్గుచేటన్నారు. అంబేడ్కర్ వాదులందరికీ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చించిన అంబేడ్కర్ ఫ్లెక్సీ స్థానంలో నూతన ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని కోరారు. అలా చేయని పక్షంలో ఉండి ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీబీహెచ్‌పీఎస్ నాయకులు రామకృష్ణ, ప్రకాష్‌రావు, విజయరాజు, మహేష్ పాల్గొన్నారు.

మాలల సత్తా ప్రభుత్వాలకు చూపుతాం

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్



విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

క్రోసూరు: ప్రజాక్షేత్రంలో మాలల సత్తా ఏంటో ప్రభుత్వాలకు చూపుతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం క్రోసూరు షాదీ ఖానాలో మాల మహానాడు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి పెదకూరపాడు మాల మహానాడు ఇన్‌చార్జ్ మాతంగి సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు గోళ్ల అరుణ్ కుమార్, డాక్టర్ గోదా జాన్ పాల్ పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అరుణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర చేస్తోందన్నారు. దానిలో భాగమే గతంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నిర్వీర్యం, నేడు రిజర్వేషన్ల వర్గీకరణ అని అన్నారు. వర్గీకరణ, క్రిమిలేయర్ విధానానికి బీజేపీ స్వస్తి పలకకపోతే రానున్న ఎన్నికల్లో బీజేపీతో పాటు బీజేపీతో కలిసి ప్రయాణం చేసి వర్గీకరణకు మద్దతు తెలిపే ఏ రాజకీయ పార్టీకైనా తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మాల మహానాడు ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అమరావతికి దారేదీ..!



పెదమద్దూరులో ఆగి ఉన్న విజయవాడ సర్వీసు బస్

అమరావతి: ప్రఖ్యాత పర్యాటక కేంద్రం, ఆధ్యాత్మిక క్షేత్రం ఎంతో చరిత్ర కలిగిన అమరావతికి విజయవాడ నుంచి రావాలంటే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధ్వానమైన రోడ్డుతో నరకం చూస్తే.. నేడు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు తిప్పలు తప్పడం లేదు. యాత్రికులు, భక్తులు ఎవరైన విజయవాడ నుంచి పెదమద్దూరు వద్ద దిగి, అక్కడ నుంచి ఆటోలో అమరావతి చేరాల్సిందే. గతంలో అమరావతి గుడి నుంచి విజయవాడకు ప్రతి 20 నిముషాలకు ఒక బస్ సర్వీస్ ఉండేది. ఈ నెలలో వచ్చిన వరదలు, భారీ వర్షాల కారణంగా అమరావతి– విజయవాడ రోడ్డులోని పెదమద్దూరు వద్ద వాగుపై ఉండే లో లెవల్ బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా మారింది. దీంతో ఆర్ అండ్ బీ శాఖ అధికారులు బ్రిడ్జి పరిశీలించి 10 రోజుల క్రితం బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను నిషేధించారు. అప్పటి నుంచి అమరావతికి విజయవాడ బస్సులు రావటం లేదు. విజయవాడ వెళ్లాలంటే అమరావతి నుంచి గుంటూరు వెళ్లి.. అక్కడ నుంచి విజయవాడ వెళ్లాలి. అంటే సుమారు 30 కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాలి. లేకుంటే ద్విచక్ర వాహనంలో గాని, ఆటోలో గాని ఎండ్రాయి, చావపాడు మీదుగా పెదమద్దూరు వెళ్లి అక్కడ నుంచి విజయవాడ బస్సు ఎక్కాలి. విజయవాడ బస్సు ఎక్కాలంటే సుమారు 12 కిలోమీటర్లు చుట్టు తిరిగి పెదమద్దూరు చేరుకుంటేగాని కుదరని పరిస్థితి నెలకొంది. గతంలో పెదమద్దూరు వాగు పొంగి ప్రవహించినప్పుడు చావపాడు, ఎండ్రాయి, నరుకుళ్లపాడు మీదుగా బస్ చార్జీ పెంచి నడిపేవారు. ప్రస్తుతం అధికారులు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఆలోచించకుండా 10 రోజుల నుంచి పెదమద్దూరు వరకు విజయవాడ అమరావతి బస్సులు నడపటం వల్ల ప్రయాణీకులు, యాత్రికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

సాగరమాత ఆలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్ మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో తేరు ప్రదక్షణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.